క్లుప్తంగా

అవకతవకలకు పాల్పడితే చర్యలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రాజ్‌మనోజు

ఉంగుటూరు : ఉపాధి కూలీల మస్టర్ల విషయంలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రాజ్‌మనోజు అన్నారు. బుధవారం ఉంగుటూరు ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హమీ సిబ్బందికి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవో మాట్లాడుతూ వేజ్ రేటు రోజుకు రూ.307 పెరిగేలా పనులు చేయించాలని అన్నారు. త్వరలో ఉపాధి హమీ పనులపై ఆడిట్ నిర్వహిస్తారని సిబ్బంది సిద్ధంగా ఉండాలని సూచించారు. సమావేశంలో ఉపాధి హమీ ఫీల్డ్ సహాయకులు, ఏపీవో, టీఏలు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన బియ్యం తనిఖీ



పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ బి.సుమతి

దెందులూరు: మధ్యాహ్న భోజనం పూర్తి స్థాయి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం దెందులూరు గారపాటి హైమావతి దేవి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన బియ్యం స్టాక్‌ను, రిజిష్టర్‌ను, మధ్యాహ్న భోజనాన్ని తహసీల్దార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఎండీఎం సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంఈఓ కె.అన్నమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గోదావరి కాలువకు నీరు విడుదల



గోదావరి కాలువలో చేరిన నీరు

ఉంగుటూరు: గోదావరి ఏలూరు కాలువకు నీరు చేరింది. నెల రోజులపాటు కాలువకు నీరు లేదు. కాలువ కట్టేయడంతో నెల రోజులు నీళ్ల లేక ప్రజలు తాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. అయితే తవ్వ పనులు మాత్రం ఉంగుటూరు మండలం పరిధిలో చేయలేకపోయారు.

సీనియర్ అసిస్టెంట్‌గా సుజాత



ఎంపీడీఓ కె.శ్రీదేవిని మర్యాదపూర్వకంగా కలిసిన సీనియర్ అసిస్టెంట్ సుజాత

దెందులూరు: ఎంపీడీఓ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వీఎస్‌వీవీ సుజాత నియమితులయ్యారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ కె.శ్రీదేవిని కలిసి, ఆర్డర్ కాపీని అందజేశారు. ఇప్పటి వరకు సీనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన కనకరాజు ఏఓగా బదిలీపై వెళ్లారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ భీమరాజు, పంచాయతీరాజ్ మినిస్ట్రీస్ ఎంప్లాయీస్ యూనియన్ భీమడోలు సమితి. జిల్లా కౌన్సిల్ మెంబర్ గుళ్లపూడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



నూతన ప్రిన్సిపాల్ భారతిని సత్కరిస్తున్న అధ్యాపకులు

భీమడోలు: పోలసానిపల్లి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల కళాశాల ప్రిన్సిపాల్‌గా నంబూరి భారతి బుధవారం నూతనంగా బాధ్యతలు స్వీకరించారు. జంగారెడ్డిగూడెం ప్రిన్సిపాల్‌గా పని చేస్తూ సాధారణ బదిలీల్లో పోలసానిపల్లి ప్రిన్సిపాల్‌గా బదిలీ అయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా పని చేసిన రమణ నుంచి చార్జి తీసుకున్నారు. అనంతరం కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను మర్యాదపూర్వకంగా కలిసి ఆత్మీయ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ బాలికల విద్య, ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు.

రహదారి భద్రత కరువు

- కానరాని హెచ్చరిక బోర్డులు
- తరచూ రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

దెందులూరు : ప్రతి ఏటా ప్రమాదాలు జరగకుండా ఆర్‌టీఓలు, పోలీసులు, పలు శాఖల అధికారులు రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ తరుచూ రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. రహదారుల్లో ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, ఆటోలు నడుపుతున్న డ్రైవర్ల వద్ద ఎటువంటి ధ్రువీకరణ పత్రాలు ఉండడం లేదు. అనుభవం లేని డ్రైవర్లు, మద్యం సేవించి వాహనాలు నడపడం, కొన్ని వాహనాలకు ఎటువంటి ఫిటెనెస్ లేకపోవటం మితిమీరిన జనాలతో ప్రయాణాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు. మరికొందరు మైనర్లకు వాహనాలు ఇవ్వడం ద్వారా తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వారిని నిలువరించే చర్యలు తీసుకోవాలని పోలీసులను పలువురు కోరుతున్నారు.

కనిపించని బోర్డులు

రహదారుల్లో స్పీడ్ బ్రేకర్లు, ప్రమాద హెచ్చరిక బోర్డులు లేవు. ముఖ్యంగా మలుపులు, జంక్షన్లు, స్కూల్ జోన్లు, ఇరుకైన బ్రిడ్జీలు ఉన్న చోట్ల బోర్డులు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. రేడియం స్టిక్కర్ల బోర్డులు లేకపోవడం వలన రాత్రి వేళల్లో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. కొత్త రహదారుల్లో ప్రయాణాలు చేసేవారు అధికంగా ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రమాద హెచ్చరికల బోర్డులను ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



సానిగూడెం మలుపు వద్ద ప్రమాదకరంగా ఉన్న మొక్కలు, చెట్లు



గార్లమడుగు వెళ్లే దారిలో హెచ్చరిక బోర్డు లేని ప్రమాదకర మలుపు

వాహనం తీస్తే భయమేస్తోంది



రహదారికి ఇరువైపులా మొక్కలు, చెట్లు ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనం కనిపించడంలేదు. ఎవరు ఏ పక్కనుంచి వచ్చి ఢీ కొడతారోనని భయంగా ఉంది. ముఖ్యంగా మైనర్లు వాహనాలు నడపడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటివాటిని అరికట్టాల్సిన బాధ్యత అధికారులు తీసుకోవాలి. – పల్లెం ప్రసాద్, మాజీ స్టేట్ కార్పొరేషన్ డైరెక్టర్

శిక్షలు కఠినంగా ఉండాలి



ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలి. నిబంధనలు ఉల్లంఘించినవారి వాహన, లైసెన్స్, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి. శిక్షలు కఠినంగా ఉంటేనే ప్రమాదాలు తగ్గుతాయి. – కట్టా ఏసుబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలి

నిడమర్రు: కూటమి సర్కారు విద్యుత్ సరఫరాకు సంబంధించి ప్రవేశ పెట్టిన స్మార్ట్‌మీటర్ల విధానాన్ని రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు నారపల్లి రమణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం నిడమర్రు ప్రజా సంఘాల కార్యాలయం వద్ద ప్లకార్డులతో సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేస్తున్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చాక అదే విధానం అమలు చేయడం ప్రజలను మోసం చేయడమేనని విమర్శించారు. కార్యక్రమంలో కోనా శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, గుత్తికొండ కృష్ణ, చీర అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలతో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నేతలు

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న అధ్యాపకులు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను బుధవారం పంపిణీ చేశారు. ఎంపీసీ విద్యార్థులకు జేఈఈ ఎంట్రన్స్ స్టడీ మెటీరియల్ మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, అలాగే బైపీసీ విద్యార్థులకు నీట్ ఎంట్రన్స్ మెటీరియల్ బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ పంపిణీ చేశారు. అదే విధంగా కళాశాలలో చేరే ఇంటర్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సైన్సు అధ్యాపకులు, లైబ్రేరియన్ ఐఎస్ఎన్ రాజు, కళాశాల ప్రిన్సిపాల్ బీవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ

భీమడోలు: వసతి గృహాల్లో విద్యార్థులు వర్షా కాలంలో అప్రమత్తతతో ఉండాలని, వ్యాధుల బారిన పడకుండా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు అన్నారు. భీమడోలు, పోలసానిపల్లి హాస్టల్ సముదాయాల్లో దోమల నివారణకు మలాధియాన్ 25 శాతం ద్రావణాన్ని తయారు చేసి బుధవారం పిచికారీ చేశారు. ఈ నెల 12వ తేదీ నుంచి పాఠశాలలు తెరవనున్న నేపథ్యంలో ముందస్తుగా వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని ఆయన హాస్టల్ సిబ్బందికి సూచించారు. ముందుగా గుండుగొలను పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ జాహ్నవి వసతి గృహాల్లోని సిబ్బందికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కార్యదర్శి కేవీ తనూజ, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ బొత్స గంగరాజు, సూపర్‌వైజర్ రామకృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు మురళీ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



వసతి గృహంలో దోమల మందును పిచికారీ చేయిస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు, హెల్త్ సిబ్బంది

పెదవేగి సీఐగా రాజశేఖర్



సీఐ రాజశేఖర్

పెదవేగి: పెదవేగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సీహెచ్ రాజశేఖర్ బాధ్యతలు చేపట్టారు. బుధవారం ఆయనకు పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ సిబ్బంది ఘన స్వాగతం పలికారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేసి, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకుంటానని సీఐ తెలిపారు.

నేడు రీసర్వే గ్రామ సభ

నిడమర్రు: అడవికొలను గ్రామ పంచాయతీ పరిధిలోని పెదరామచంద్రపురం రీసర్వే ప్రాజెక్టుకు పైలెట్ గ్రామంగా ఎంపికైందని తహసీల్దార్ తెలిపారు. రీసర్వేకు సంబంధించిన గ్రామ సభను గురువారం అడవికొలను గ్రామ సచివాలయం వద్ద ఉదయం 11గంటలకు ఏర్పాటు చేశామన్నా రు. ఈ గ్రామ సభకు పెదరామచంద్రపురానికి సంబంధించిన రైతులు హాజరవ్వాలని తహసీల్దారు కోరారు.

తహసీల్దార్ నాగరాజు బదిలీ

నిడమర్రు: నిడమర్రు మండల తహసీల్దార్ ఎస్.నాగరాజు ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో కొయ్యలగూడెం మండల తహసీల్దార్‌గా బదిలీ అయినట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు. వారి స్థానంలో ఎవరూ రాకపోవడంతో డీటీ బి.దుర్గాప్రసాద్ పూర్తి అదనపు బాధ్యతలను బుధవారం స్వీకరించారు.

పాఠశాలల పునఃప్రారంభానికి సిద్ధం

గణపవరం: వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునఃప్రారంభానికి సిద్ధం అయ్యాయి. ఓ పక్క ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ జరుగుతుండగా పాఠశాలలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల నుంచి అన్ని పాఠశాలలకు మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి సన్న బియ్యం, కోడిగుడ్లు, రాగి జావ, బెల్లం చిక్కీలు సరఫరా అవుతున్నాయి. గురువారం పిల్లలకు మధ్యాహ్న భోజనం వండటానికి వీలుగా ఎండీఎం నిర్వాహకులు ఒక రోజు ముందుగానే వంట గది, వంట సామగ్రిని కడిగి శుభ్రం చేశారు. ఇప్పటికే కొన్ని రకాల పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు పాఠశాలలకు చేరాయి.



ఆఫీస్ గదిలో రిజిస్టర్‌లు, పుస్తకాలు సర్దుకుంటున్న హెచ్ఎం

నేడు పాఠశాలల్లో సన్న బియ్యం వండాలి



పాఠశాలకు అందిన బియ్యాన్ని తనిఖీ చేస్తున్న రెవెన్యూ అధికారులు

నిడమర్రు: అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో గురువారం పాఠశాలలకు సరఫరా చేసిన సన్నబియ్యం మాత్రమే వండాలని ఇన్‌చార్జి తహసీల్దార్ దుర్గాప్రసాద్ అన్నారు. బుధవారం పాఠశాలలకు అందిన సన్న బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా సివిల్ సప్‌లై డీటీ జరినాభేగం మాట్లాడుతూ గతంలో పాఠశాలల్లో నిల్వ ఉన్న బియ్యం పక్కన, ఈ సన్న స్నబియ్యం సంచులు ఉంచరాదని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో కార్యాలయ సిబ్బంది, దాసు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సమావేశం

ఉంగుటూరు: మండల పరిషత్ సమావేశం నేడు (గురువారం) ఉదయం పదిన్నర గంటలకు ప్రారంభమవుతుందని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి తెలిపారు. ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో అభివృద్ధి పనులపై చర్చిస్తారని తెలిపారు. సకాలంలో ఎంపీటీసీలు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని ఆమె కోరారు.

ఉపాధి కూలీలు పని త్వరగా ముగించుకోవాలి



కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ ఫాతిమా ప్రసన్న

దెందులూరు: ఉపాధి కూలీలు ఎండ బారిన పడకుండా పనులు త్వరగా ముగించుకోవాలని జాతీయ ఉపాధి హామీ పథకం ఏపీఓ ఫాతిమా ప్రసన్న అన్నారు. బుధవారం కొవ్వలిలో ఉపాధి పనులను, మస్టర్లను, కొలతలను పరిశీలించారు. ఫీల్డ్ అసిస్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్లకు పలు ఆదేశాలు అందజేశారు. కూలీలు పనులు అయిన వెంటనే వెళ్లిపోయేలా మేట్లు శ్రద్ధ తీసుకోవాలన్నారు.

సాగులో యాంత్రీకరణకు ప్రోత్సాహం

పెదవేగి: సాగులో యాంత్రీకరణను ప్రోత్సహిస్తున్నామని, ఈ నెల 20 నుంచి రైతులకు అన్నదాతా సుఖీభవ ఆర్థిక సాయం అందించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజారపు అచ్చెన్నాయుడు చెప్పారు. మండలం వంగూరులో బుధవారం నాగలితో పొలం దున్ని ఏరువాక పూర్ణిమ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. వ్యవసా య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావు, వ్యవసాయ కమిషన్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి పాల్గొన్నారు.

రేపు ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా

దెందులూరు: వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి ఈ నెల 13న ఏలూరు విచ్చేస్తారని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. బుధవారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధినేత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు 13న ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామన్నారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, వర్కింగ్ ప్రెసిడెంట్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి హాజరవుతారన్నారు. 9.30 గంటలకు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహం వద్ద నుంచి ర్యాలీగా బయలు దేరి కలెక్టరేట్ వద్ద ధర్నా చేసి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తామన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై ధర్నా కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయంతో ఖర్చుల ఆదా

గణపవరం: రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంభించడం ద్వారా తక్కువ పెట్టుబడితో నాణ్యమైన దిగుబడులను పొందొచ్చని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. బుధవారం గణపవరం మండలం చిలకంపాడు గ్రామంలో ఏరువాక పూర్ణిమ సందర్భంగా వ్యవసాయ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఏడీఏ మురళీకృష్ణ, ఏవో యర్రంశెట్టి ప్రసాద్, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ ఇందుకూరి రామకృష్ణంరాజు, రంగరాజు, చుక్కా అప్పారావు, తోటశ్రీను, కొయ్యా సుబ్బారావు, కొలనువాడ శ్రీనివాసరాజు, తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారి అభివృద్ధి

సాక్షి స్పందన

భీమడోలు: గత నెల 27వ తేదీన ఆదమరిస్తే అంతే సంగతులు అనే శీర్షికన సాక్షిలో ప్రచురితమైన కథనానికి భీమడోలు పంచాయతీ అధికారులు స్పందించారు. భీమడోలులోని కోర్టు, బీఎస్ఎన్ఎల్ కార్యాలయానికి వెళ్లే దారి అధ్వానంగా మారింది. దీనివలన భారీ గోతులను తప్పించుకుని వాహనదారులు వెళ్లాలంటేనే భయపడి పోతున్నారు. అతి జాగ్రత్తగా వెళ్లకుంటే డ్రెయిన్‌లో పడి గాయాల పాలవుతున్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో అధ్వానంగా ఉన్న దారిని అభివృద్ధి చేయాలని వార్త ప్రచురితమైంది. దీనిపై స్పందించిన పంచాయతీ అధికారులు అక్కడ భారీ తూర ఏర్పాటుచేసి, గ్రావెల్‌వేసి శాశ్వతంగా రోడ్డును వేశారు. దీంతో వాహనదారులు పంచాయతీ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.



తూర వేసి అభివృద్ధి చేసిన రహదారి

యోగా సాధనతో ఆరోగ్యకర సమాజం

పెదవేగి: యోగా సాధనతో మానసిక, శారీరక స్థిరత్వం పొంది చక్కటి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ప్రముఖ ఆర్ట్‌ఆఫ్ లివింగ్ యోగా గురువు చెన్నారెడ్డి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని దుగ్గిరాలలో సెయింట్ జోసెఫ్ దంత కళాశాలలో విద్యార్థులతో ఆయన యోగ సాధన చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ యోగ సాధన చేస్తే అన్ని రంగాల్లో ప్రగతిని పొందుతారన్నారు. అనంతరం కళాశాల అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్ మాట్లాడుతూ ప్రతి ఇంటా యోగా చేయాలని, ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించాలని ఆయన తెలిపారు. అనంతరం యోగా గురువు ప్రవీణ్‌ను దంత కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో దంత కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ జి.మోజెస్, అడ్మినిస్ట్రేటర్ ఫాదర్ ఫెలిక్స్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.స్లీవరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.పావనసంధ్య, దంత వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



యోగా సాధన చేస్తున్న దంత వైద్య విద్యార్థులు

సాక్షి కార్యాలయంపై దాడి అమానుషం

భీమడోలు: ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి చేయడం, సాక్షి యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావును అక్రమంగా అరెస్ట్‌చేయడం అప్రజాస్వామ్యమని వైఎస్సార్‌సీపీ నేతలు ముక్త కంఠంతో ఖండించారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన సాగుతుందని, ఏడాదిపాలనలో వైఎస్సార్‌సీపీ వర్గీయులను టార్గెట్ చేస్తూ హత్యలు, అక్రమ అరెస్టులుచేయడం, ఆభంశుభం తెలియని బాలికలు, యువతులపై అత్యాచారాలు చేయడంతప్ప అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఏలూరు సాక్షి కార్యాలయంపై టీడీపీ గుండాలు దాడికి దిగడం, కేఎస్ఆర్‌కు సంబంధం లేని విషయంలో ఆయనను అరెస్ట్ చేయడం సిగ్గుచేటన్నారు. సాక్షిమీడియా నిజాలను నిర్భయంగా ప్రజల ముంగిట ఉంచుతున్నందున కూటమి సర్కార్ అక్కసు తట్టుకోలేక ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతుందన్నారు. మీడియా స్వేచ్ఛకు భంగం కలిగించకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. సాక్షి మీడియాకు ప్రజా మద్దతు ఉంటుందని, తాము అండగా ఉంటామని మండల అధ్యక్షుడు రావిపాటి సత్య శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముళ్లగిరి జాన్సన్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు తుమ్మగుంట రంగ, గ్రీవెన్స్ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పాము మాన్‌సింగ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మద్దుల రాజా, ఆర్‌టీఐ నియోజకవర్గ అధ్యక్షుడు అంబటి నాగేంద్ర ప్రసాద్, మండల ఉపాధ్యక్షుడు రామకుర్తి నాగేశ్వరరావు, తదితరులు తీవ్రంగా ఖండించారు.

రక్తపోటు.. నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకం

గణపవరం: రక్తపోటును నిర్లక్ష్యం చేస్తే ప్రాణాంతకమని, అందువలన సరైన ఆహార నియమాలు, తగిన వ్యాయామంతో రక్తపోటును అదుపులో ఉంచుకోవాలని గణపవరం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఓంకార్‌నాథ్, కిరణ్మయి అన్నారు. బుధవారం ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా గణపవరంలో రక్తపోటు అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్తపోటు వలన అవయవాలు చెడిపోయే ప్రమాదం ఉందన్నారు. అధికరక్తపోటు వలన గుండెకు సంభందించిన వ్యాధులు, బ్రెయిన్ స్ట్రోక్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బంది రక్తపోటుపై అవగాహన కల్పించే నినాదాలు చేస్తూ గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్‌వో జాలాది విల్సన్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన ప్రదర్శన చేస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పిప్పర పీహెచ్‌సీలో

35 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా రక్తపోటు, మధుమేహ పరీక్షలు చేయించుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఐ.శ్రీదివ్య సూచించారు. గురువారం ప్రపంచ మధుమేహ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీలో రక్తపోటు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎలుకల మందు తిని మహిళ మృతి

పెదవేగి : కుమార్తెపై అలిగి, మనస్తాపానికి గురైన మహిళ ఎలుకల మందు తిని మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలవరాన్ని సృష్టించింది. పెదవేగి ఎస్సై కె.రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొండలరావుపాలేనికి చెందిన కనపర్తి రేణుక ఆమె భర్తకు దూరంగా కుమార్తె రమ్య స్రవంతితో నివసిస్తోంది. ఈ నేపథ్యంలో రమ్య స్రవంతి బీటెక్‌లో కొన్ని సబ్జెక్టులు పాసవ్వలేదు. ఇవి ఇలా ఉండగా ఈ నెల 5న ఆమె జావా కోర్స్ చేస్తానని తల్లి రేణుకను అడిగింది. దీనికి తల్లి ముందు ఉన్న సబ్జెక్టులు పూర్తి చేసి ఆ తరువాత కోర్స్ చేయమని చెప్పడంతో కోపంతో రమ్య స్రవంతి ఇంట్లోని ఓ గదిలోకి వెళ్లి ఎంత కొట్టినా రాత్రంతా తలుపులు తీయలేదు. దీంతో మనస్తాపం చెందిన రేణుక ఎలుకల మందు తీసేసింది. ఇది గమనించిన స్థానికులు హుటాహుటిన ఏలూరులో ఆసుపత్రికి తరలించారు. ఆపై మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడకు తరలించగా ఈ నెల 11న సాయంత్రం రేణుక (38) మృతి చెందిందని ఆమె కుమార్తె రమ్య స్రవంతి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఘనంగా ఏరువాక పున్నమి పూజలు

భీమడోలు: ఏరువాక పౌర్ణమి పండుగను పురస్కరించుకొని బుధవారం రాత్రి ఆలయాల్లో పూజలు చేశారు. ఆర్జావారిగూడెం రామాలయంలో మహిళలు పూజారి గండి వెంకన్నబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని ప్రతిఏటా ఏరువాక పౌర్ణమిని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హాయంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో దళితవాడలో రామాలయాన్ని నిర్మించారు. దీంతో ఆలయంలో దీపధూప నైవేద్యాలను స్వామి వార్లకు సమర్పిస్తున్నారు.



ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు